ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.02.06.2026 సమయం. 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. సమగ్ర, సమ్మిళిత అభివృద్ధికి తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు.

2. న్యాయవాదుల భద్రతకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలుకు ఈరోజు నోటిఫికేషన్ విడుదల చేసింది.

3. ఓటరు జాబితా ప్రక్రియలో ప్రజలను భాగస్వాములను చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కలెక్టర్లను ఆదేశించారు. 'సర్' ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.

4. రాగల మూడు రోజుల పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుండి ఒక మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

**గవర్నర్**

సమగ్ర, సమ్మిళిత అభివృద్ధికి తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. హైదరాబాద్‌లోని లోక్ భవన్ సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో ఈరోజు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. "ఏక్ భారత్ , శ్రేష్ఠ భారత్" కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ వేడుకలకు గవర్నర్ దంపతులు హాజరయ్యారు. "జై

తెలంగాణ" అనేది కేవలం నినాదం కాదని , అది ఆత్మగౌరవం, ఐక్యత, స్వీయ గుర్తింపు కోసం సాగిన ఉద్యమానికి ప్రతీక అని గవర్నర్ పేర్కొన్నారు. అమరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ స్వరాష్ట్ర కల సాకారమైందని ఆయన గుర్తు చేశారు. వేడుకల సందర్భంగా ఒగ్గు డోలు, బోనాలు, గుస్సాడి, కోలాటం, డప్పు, బంజారా కళాకారులు నిర్వహించిన పరేడ్ తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటాయి.

డెస్క్

**కిషన్ రెడ్డి**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలోని తన అధికారిక నివాసంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ చారిత్రాత్మక తరుణంలో.. తెలంగాణ ఆత్మగౌరవాన్ని చాటి చెబుతూ, ప్రత్యేక రాష్ట్ర సాకారం కోసం అలుపెరగని పోరాటం చేసిన అమరవీరుల త్యాగాలను కొనియాడారు.

డెస్క్

**TG ADVOCATES PROTECTION BILL**

తెలంగాణలో న్యాయవాదుల భద్రతకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కీలక నిర్ణయం తీసుకుంది. ఎంతో కాలంగా లాయర్లు ఎదురుచూస్తున్న తెలంగాణ అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈరోజు నుంచే ఈ న్యాయవాదుల రక్షణ చట్టం రాష్ట్ర వ్యాప్తంగా అమల్లోకి వచ్చినట్లు న్యాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల లాయర్లపై పెరుగుతున్న దాడులు, బెదిరింపులను అరికట్టడమే లక్ష్యంగా ఈ చట్టాన్ని తెచ్చారు. ఇకపై న్యాయవాదులపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని ప్రభుత్వం హెచ్చరించింది. ఈ నిర్ణయంపై న్యాయవాద సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

PTC, HYD

**సర్**

ఓటరు జాబితా ప్రక్రియలో ప్రజలను భాగస్వాములను చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కలెక్టర్లను ఆదేశించారు. 'సర్' ప్రక్రియపై ప్రజల్లో అవగాహన

కల్పించాలన్నారు. ఈనెల 4, 6, 9, 10 తేదీల్లో గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన వివరించారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై కలెక్టర్లలో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో పంటల వైవిధ్యతపై రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, పర్యావరణం పైనా అవగాహన కల్పించాలని సూచించారు.

డెస్క్

**అఖిలపక్ష సమావేశం**

తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి , గౌరవించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఈనెల 4వ తేదీన అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించనుంది. హైదరాబాద్‌లోని డా.బీ.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఈ సమావేశం జరుగుతుంది. సమావేశానికి హాజరై సలహాలు , అభిప్రాయాలు పంచుకునేందుకు ఒక్కో పార్టీ నుండి ఇద్దరు ప్రతినిధులను పంపించాలని ప్రభుత్వం కోరింది.

ప్రెస్ నోట్

**పొంగులేటి**

పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో నేడు నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు , డబుల్ బెడ్‌రూమ్ గృహాల మంజూరు పత్రాలను ఆయన పంపిణీ చేశారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. అంతకుముందు కాజీపేట మండలం న్యూ షాయంపేటలో నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయాన్ని మంత్రి ప్రారంభించి , లబ్ధిదారులకు గృహప్రవేశ కానుకలను అందజేశారు.

పిటిసి, వరంగల్

**శ్రీధర్ బాబు**

రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు ఆయన అమరవీరుల స్మారక స్థూపం వద్ద నివాళులర్పించి , అమరవీరుల కుటుంబాలను సన్మానించారు. ఈ సందర్భంగా 672 మహిళా స్వయం సహాయక సంఘాలకు 57 కోట్ల 38 లక్షల రూపాయల చెక్కులను మంత్రి పంపిణీ చేశారు . అనంతరం మంత్రి మాట్లాడుతూ... అమరవీరుల త్యాగాల పునాదులపై ఏర్పడిన రాష్ట్రం ఈరోజు అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు.

ప్రెస్ నోట్

**PONNAM**

పేద ప్రజల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, వాటిని క్షేత్రస్థాయిలో పేద ప్రజలకు అందించాల్సిన బాధ్యత అధికారులదే అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈరోజు సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయంలో మంత్రి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... వర్షాకాలం ప్రారంభం కానున్నందున వన మహోత్సవం కార్యక్రమం ద్వారా మొక్కలను పెంచి పచ్చదనం రూపొందించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. వరికి బదులుగా పప్పు దినుసులు , నూనె గింజలు ఇతర వాణిజ్య పంటలు పండించేలా రైతులను సిద్ధం చేయాలని సూచించారు. బడిబాట కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలలో పేద పిల్లలను చేర్పించాలన్నారు.

పీటీసీ, సిద్దిపేట

**కే. లక్ష్మణ్**

నాగర్‌కర్నూల్ జిల్లాలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ శిక్షణ మహాభియాన్ – 2026" జిల్లా శిక్షణ శిబిరాన్ని రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే. లక్ష్మణ్ ఈరోజు ప్రారంభించారు. కార్యకర్తలలో పార్టీ సిద్ధాంతాలు , సేవా భావం , సంస్థాగత బలోపేతం , ప్రజాసేవ పట్ల మరింత అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

PN

**కేటీఆర్**

ప్రతిభను ప్రోత్సహించడం ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు అన్నారు. సిరిసిల్ల లో పదో తరగతి వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆయన ఉచితంగా ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తారక రామారావు మాట్లాడుతూ. .. నేటి డిజిటల్ యుగంలో విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు ఈ ట్యాబ్‌లను విద్యాభివృద్ధికి ఉపయోగించుకుని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు.

పిటిసి, సిరిసిల్ల

**ఆది శ్రీనివాస్ ... బైట్**

రైతులు పండించిన పంట చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సిరిసిల్ల అపరెల్ పార్కు, మార్కెట్ యార్డులను జిల్లా అదనపు కలెక్టర్ తో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ...

బైట్ ... ఆది శ్రీనివాస్

పిటిసి, సిరిసిల్ల

**"తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ"**

తెలంగాణ ఆర్టీసీ బస్‌భవన్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సంస్థ ఎండీ వై. నాగిరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి , అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ జెండా కోట్లాది మంది ఆత్మగౌరవ నినాదమని అన్నారు. రాష్ట్ర ప్రగతిలో ఆర్టీసీ కీలక భాగస్వామిగా నిలిచిందని , సిబ్బంది క్రమశిక్షణ వల్లే సంస్థ దేశంలోనే రోల్ మోడల్‌గా ఎదిగిందని అభినందించారు. ముఖ్యంగా 'మహాలక్ష్మి' పథకం ద్వారా 10 వేల కోట్ల ఉచిత మహిళా ప్రయాణాలను పూర్తి చేసి సరికొత్త రికార్డు సృష్టించామన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం పెద్ద ఎత్తున ఎలక్ట్రిక్ బస్సులను విజయవంతంగా నడుపుతున్నామని , లైవ్ ట్రాకింగ్ , డిజిటల్ చెల్లింపులు ప్రవేశపెట్టామని తెలిపారు.

డెస్క్

**వాతావరణం**

రాగల మూడు రోజుల పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుండి ఒక మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. రానున్న నాలుగు రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు 2 నుండి 4 డిగ్రీల వరకు తగ్గే అవకాశం ఉందని తెలిపింది. ఈ మూడు రోజుల పాటు రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఉరుములు , మెరుపులతో పాటు గంటకు 50 నుండి 60 కిలో మీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

ప్రెస్ నోట్

**సీఎండీ బుద్ధప్రకాష్ జ్యోతి**

హైదరాబాద్ సింగరేణి భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సంస్థ చైర్మన్ , ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి , తెలంగాణ తల్లి , అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బుద్ధప్రకాష్ మాట్లాడుతూ... సింగరేణిని అంతర్జాతీయ స్థాయికి చేర్చడమే రాష్ట్రానికి మనం ఇచ్చే

గౌరవమని, పోటీ మార్కెట్‌లో నిలబడేందుకు ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

ప్రెస్ నోట్

**సింగరేణి గనులు - ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను సింగరేణి గనుల వద్ద ఘనంగా నిర్వహించారు. మంచిర్యాల జిల్లా మందమర్రి , శ్రీరాంపూర్ ఏరియాల్లో కార్మికులు గనుల వద్ద జాతీయ జెండాలు ఎగురవేసి సంబరాలు చేసుకున్నారు. మందమర్రి సింగరేణి పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ...

**బైట్ ... మందమర్రి జిఎం రాధాక్రిష్ణ**

పిటిసి, మంచిర్యాల

**కలెక్టర్ గరిమ అగర్వాల్**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి.. జాతీయ జెండాను ఆవిష్కరించారు.

పిటిసి, సిరిసిల్ల

**బీర్ల ఐలయ్య**

మహిళల ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. జనగామ జిల్లాలో మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 62 ఎరువుల దుకాణాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా , ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ... మహిళా సంఘాల ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ ఎరువుల దుకాణాలు

గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు మహిళలకు స్థిరమైన ఆదాయ వనరులుగా నిలుస్తాయని తెలిపారు.

పిటిసి, జనగామ

**తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**

అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో మంచిర్యాల జిల్లా ముందుకు వెళ్తోందని , ప్రభుత్వం ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రా వు అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా మంచిర్యాల జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు..

**పిటిసి, మంచిర్యాల**

**సదస్సు**

హైదరాబాద్ నగరాన్ని మాదకద్రవ్య రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు హైదరాబాద్ సిటీ పోలీసులు చురుకైన చర్యలు తీసుకుంటున్నారు. శంషాబాద్ , రాజేంద్రనగర్ జోన్ల టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో డ్రగ్స్ వినియోగదారులు , పెడ్లర్లు వంద మందికి ప్రత్యేక కౌన్సిలింగ్ , పునరావాస సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మానసిక ఆరోగ్యం , వ్యసన విముక్తిపై అవగాహన కల్పించడంతో పాటు.. మాదకద్రవ్యాలతో శారీరక దుష్పరిణామాలపై వివరించారు. హైదరాబాద్‌ను డ్రగ్స్ రహిత నగరంగా చేసేందుకు ప్రజలు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

డెస్క్

**వస్త్ర ప్రదర్శన**

అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి పొందిన పోచంపల్లి 'ఇక్కత్' వస్త్ర ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ఈనెల 5, 6, 7 తేదీల్లో ప్రత్యేక వస్త్ర ప్రదర్శనను నిర్వహించనున్నారు. పోచంపల్లి చేనేత కళాకారుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే లక్ష్యంతో హైదరాబాద్

హైటెక్స్ లో  'త్రెడ్ పోచంపల్లి' పేరిట ఈ వస్త్ర ప్రదర్శనను ఏర్పాటు చేయబోతున్నారు.    చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయాలను మెరుగుపరిచేందుకు ఏర్పాటు చేసే ఈ ఎగ్జిబిషన్ లో దాదాపు 100 పైగా  స్టాల్స్, ఏర్పాటు చేయబోతున్నట్లు అధికారులు తెలియజేశారు.

డెస్క్